ప్రజాశక్తి
శనివారం 22 జూన్ 2024
5
కర్నూలు





మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

టమోటా(త)టా

- రూ.వందకు చేరిన ధర
- ఇతర కూరగాయలు అదే దారిలో
- సామాన్యులకు ధరాఘాతం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. టమోట ధర కిలో ఏకంగా రూ.వందకు చేరింది. ఇతర కూరగాయలు కూడా అదే దారిలో పరుగిడుతున్నాయి. డిమాండుకు సరిపడా సరఫరా లేకపోవడంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు...



కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల రేట్లు చుక్కల్లో చేరాయి. టమోట కిలో ఏకంగా రూ.వందకు చేరింది. వర్షాకాలం ప్రారంభంకావడంతో పంట ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. దీంతో అన్నిరకాల ధరలకు రెక్కలొచ్చాయి. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక్కరోజు కూరగాయలకు కనీసం రూ.150పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలో ఏ రోజుకా రోజు కూరగాయలు కొనుగోలు చేయడం ఎక్కువ. దీంతో చాలా మంది తోపుడుబండ్ల తో కాలనీల్లో తిరుగుతూ కూరగాయలు విక్రయిస్తుంటారు. కానీ వాటి ధరలు అధికంగా ఉండటంతో తోపుడు బండ్ల వారు రావడమే మానేశారు. కర్నూలు మార్కెట్ యార్డుకు స్థానిక రైతులు పండించిన కూరగాయలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కూడా కూరగాయలు వస్తున్నాయి. వాటిని కొందరు కొనుగోలు చేసి రైతు బజార్‌లలో విక్రయిస్తుంటారు. స్థానికంగా టమోటా దిగుబడి సరిగ్గా లేకపోవడంతో కర్నూలు మార్కెట్‌కు మదనపల్లి, మొలకలచెరువు నుంచి టమోటాలు వస్తున్నాయి. ప్రస్తుతం స్థానికంగా మిర్చి పంట లేకపోవడంతో కర్ణాటకలోని బెళగాం నుంచి మిర్చి వస్తోంది. వంకాయ, క్యారెట్, క్యాబేజీ, ఆలూ, చెవులేకాయ వంటి కూరగాయలు స్థానికంగా చుట్టు పక్కల ప్రాంతాల రైతులు తీసుకువస్తున్నారు. డిమాండుకు సరిపడా సరుకు రాకపోవడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి.

కర్నూలు నగరంలో గత నెలలో రూ.40 నుంచి రూ.50 వరకూ ఉన్న కిలో టమోటా ప్రస్తుతం రూ.వంద పలుకుతోంది. టమోటాతో పాటు అన్ని కూరగాయల ధరలు పెరిగిపోయాయి. మొన్నటి వరకూ కిలో రూ.40 ఉన్న వంకాయ రూ.80, రూ.40 ఉన్న బెండ రూ.60కు, రూ.40 ఉన్న పచ్చిమిర్చి రూ.80కు పెరిగాయి. కాకర, బీర కిలో రూ.80, కాలీఫ్లవర్ రూ.65, క్యారెట్ రూ.70, క్యాబేజీ రూ.50, ఆలూ కిలో రూ.60, చెవులేకాయ రూ.60, బీట్‌రూట్ రూ.80కు విక్రయిస్తున్నారు. అల్లం ధర అమాంతం పెరిగిపోయింది. ప్రస్తుతం కిలో రూ.200కు పెరిగింది. నంద్యాలలో టమోటా కిలో రూ.వంద, వంకాయ కిలో రూ.80, మునక్కాయలు ఒక్కోటి రూ.10, బీరకాయ కిలో రూ.70, ఆలూ రూ.60, క్యారెట్ రూ.70కు విక్రయిస్తున్నారు. ఆదోనిలో టమాటాలు కిలో రూ.90 నుంచి రూ.వందకు విక్రయిస్తున్నారు. ఉల్లిపాయలు కిలో రూ.50 నుంచి రూ.60కి చేరాయి. ఆలూ, బీన్స్, క్యాబేజీ పువ్వు గత నెలలో కిలో రూ.50 ఉండగా ప్రస్తుతం రూ.90కి విక్రయిస్తున్నారు. క్యారెట్ రూ.40 నుంచి రూ.70కి చేరుకుంది. బీరకాయలు, గోరుచిక్కుడు, వంకాయలు, దొండకాయలు, బెండకాయలు, క్యాబేజీ రూ.30 నుంచి రూ.60కి పెరిగాయి. సారికంద రూ.30 నుంచి రూ.40కి, కాకరకాయలు రూ.40 నుంచి రూ.50కి చేరుకున్నాయి. కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యుల జేబులు చిల్లుపడుతున్నాయి.



ధరలను నియంత్రించాలి

కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ధరలను నియంత్రించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. తక్కువ ధరలకు కూరగాయలు అందించేలా కృషి చేయాలి.

- మమత, గృహిణి, ఆదోని.



టమోటా రేటు..ఉల్లి ఘాటు..

ప్రస్తుతం రైతుబజార్‌లో కిలో ఉల్లి రూ.60 పలుకుతోంది. బహిరంగ మార్కెట్‌లో రూ.85కు విక్రయిస్తున్నారు. వర్షాల ప్రభావంతోనే అకాల వర్షాలతో దిగుబడి తగ్గడం, రవాణా చార్జీలు పెరగడమూ కూరగాయల ధరల పెరుగుదలకు కారణం. కొత్త పంటలు వేసే సీజన్ కావడంతో రైతుబజార్‌కు వచ్చే కూరగాయల దిగుమతి తగ్గింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలను తెప్పించి పేదలను ఆదుకోవాలి.

- పద్మావతి, గృహిణి, ఆదోని.

మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణంపై
దృష్టి పెట్టాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరానికి సంబంధించి కొత్తగా ముగ్గురు ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారని, వీరు తాగునీటి సమస్య పరిష్కారానికి రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణంపై దృష్టి పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరు సూర్యనారాయణ భవన్ సిపిఎం కార్యాలయంలో కర్నూలు న్యూ సిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. సిపిఎం నాయకులు సిహెచ్.సాయిబాబా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల హాజరయి మాట్లాడారు. కల్లూరు కాలనీలు కార్పొరేషన్‌లో విలీనమై 25 ఏళ్లు కావస్తోందని, నేటికీ రోజూ తాగేందుకు నీరు రావడం లేదని తెలిపారు. రెండు, మూడు రోజులకు ఒకసారి వస్తున్నా తాగునీరు కూడా ఎలాంటి శుద్ధి చేయకుండా ఒండ్రు నీరు వస్తోందని పేర్కొన్నారు. ఈ కాలనీలకు తోడుగా పందిపాడు, లక్ష్మీపురం, దూపాడు, పెద్దపాడు, స్టాంటన్‌పురం, మాసమసీదు, మామిదాలపాడు ప్రాంతాలు కార్పొరేషన్‌లో కలిశాయని తెలిపారు. నగర జనాభా రోజురోజుకు పెరుగుతోందని, జనాభాకు అనుగుణంగా తాగునీటి అవసరాలకు మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు అవసరమని చెప్పారు. చాలా కాలంగా ప్రజలు కోరుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు స్పందించలేదని విమర్శించారు. ప్రస్తుతం గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణంపై దృష్టి పెట్టాలని కోరారు. అలాగే చెన్నమ్మ సర్కిల్ నుంచి పందిపాడు వరకు, వై జంక్షన్ నుంచి ఎల్ పేట వరకు రోడ్లు వెడల్పు చేసి సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సుందరయ్య సర్కిల్‌లో రోజూ ప్రమాదాలు జరుగుతున్నా ఆర్అండ్‌బి అధికారులు కానీ, మున్సిపల్ అధికారులు కానీ స్పందించడం లేదని విమర్శించారు. వెంటనే సుందరయ్య సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని, స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోజురోజుకు కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, వాటిని అదుపు చేసి ధరలు తగ్గించేందుకు కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, నగర కార్యదర్శి వర్గసభ్యులు కె.సుధాకరప్ప, ఆర్.నరసింహులు, కె.ప్రభాకర్, సిపిఎం నాయకులు కె.అరుణ, ధనలక్ష్మి, శంకర్, ఏసు, ఎస్.హుస్సేన్ బాషా, శేషాద్రి, రామకృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.

ఏరువాక పున్నమి
రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్



రైతులతో కలిసి ఎద్దుల బండి తోలుతున్న రామకృష్ణ

ఏరువాక పున్నమి రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ ఆకాంక్షించారు. శుక్రవారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో ఏరువాక పున్నమిని రైతు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈఏడాది వర్షాలు బాగా కురుస్తాయని, రుతుపవనాలు బాగా వస్తాయని వాతావరణ కేంద్రం తెలియజేస్తోందని చెప్పారు. గత మూడేళ్లుగా రైతులు అతివృష్టి, అనావృష్టితో అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కొద్దిమేర కురిసినప్పటికీ ప్రభుత్వాల చిత్తశుద్ధి లోపం వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. రైతులు కరువుతో అలమటించారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అనేక మండలాలను ప్రభుత్వం కరువుగా ప్రకటించిందని, కర్నూలు మండలాన్ని మాత్రం నది పరివాహక ప్రాంతం, నీటి సౌకర్యం పుష్కలంగా ఉందనే కారణంతో కరువు జాబితాలో చేర్చకపోవడం బాధాకరమని తెలిపారు. ఒకవైపు వాతావరణం సహకరించక రైతులు నష్టపోతుంటే మరోవైపు ప్రభుత్వమే నకిలీ విత్తనాలు అమ్మే కంపెనీలతో కుమ్మక్కై రైతులను మోసం చేసిందని విమర్శించారు. కొద్దిమేర పంటలు చేతికొస్తే గిట్టుబాటు ధర ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. ఈ సంవత్సరమైనా నకిలీ విత్తనాలను అరికట్టి రైతులకు అండగా నిలవాలని కోరారు. రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఏరువాక పున్నమి సందర్భంగా ఎద్దులను, ఎద్దుల బండ్లను అలంకరించి తప్పెటతో ఊరేగించిన రైతులను, రైతుసంఘం నాయకులను అభినందించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, రైతు సంఘం గ్రామ కార్యదర్శి ఇస్మాయిల్, నాయకులు వెంకటయ్య, బడే సాహెబ్, లక్ష్మన్న, లోకన్న, రామన్న, సీతారాముడు, సుధాకర్, మద్దిలేటి, కృష్ణ పాల్గొన్నారు.

కర్నూలు (కార్పొరేషన్) : ఓర్వకల్లు మండలం నన్నూరు, కల్లూరు మండలం తడకనపల్లె గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో ఏరువాక పున్నమి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఎద్దులను ముస్తాబు చేసి గాడిపాడుకు టెంకాయ కొట్టి ఏపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు ప్రారంభించారు. హేమంత్ కుమార్, తడకనపల్లె గ్రామం రఫీ, వడ్డే షేక్షావలీ, మాలి రామిరెడ్డి, జాఫర్, మూగన్న, నన్నూరు రామకృష్ణ, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

అనే నేను...

- ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

శాసనసభ్యులుగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన 14 మంది గురువారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. వారి చేత అసెంబ్లీ ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 11 మంది టిడిపి ఎమ్మెల్యేలు, ఇద్దరు వైసిపి ఎమ్మెల్యేలు, ఒక బిజెపి ఎమ్మెల్యే గెలుపొందిన సంగతి తెలిసిందే. పాణ్యం ఎమ్మెల్యేగా గౌరు చరితా రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యేగా మంత్రి ఎన్ఎండి ఫరూక్, బనగానపల్లె ఎమ్మెల్యేగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, డోన్ ఎమ్మెల్యేగా కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా భూమా అఖిలప్రియ, శ్రీశైలం ఎమ్మెల్యేగా బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యేగా గిత్త జయసూర్య అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. కర్నూలు ఎమ్మెల్యేగా మంత్రి టీజీ భరత్, కోడుమూరు ఎమ్మెల్యేగా బొగ్గుల దస్తగిరి, పత్తికొండ ఎమ్మెల్యేగా కెఇ శ్యాం కుమార్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఆదోని ఎమ్మెల్యేగా వాల్మీకి పార్థసారథి, మంత్రాలయం ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యేగా బుసినే విరూపాక్షి ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాలను జిల్లా వాసులు టివిలు, సామాజిక మాధ్యమాల ద్వారా వీక్షించారు.









ప్రమాణ స్వీకారం చేస్తున్న టిజి.భరత్, గౌరు చరితా రెడ్డి, బీవీ.జయనాగేశ్వర రెడ్డి, కెఇ.శ్యాంకుమార్









ప్రమాణ స్వీకారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి, వై.బాలనాగిరెడ్డి, బి.విరుపాక్షి, పార్థసారథి

యోగాతో ఆరోగ్యం పదిలం

- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. శుక్రవారం నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ, నగర పాలక సంస్థ, కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యోగా కార్యక్రమానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు, డిఆర్ఓ కె.మధుసూదన్ రావు, జాతీయ యోగా సంఘం సభ్యులు శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు. జిల్లా యోగా అసోసియేషన్ కె.విజయ్ కుమార్ వారి బృందం వారు కార్యక్రమానికి హాజరైన యోగా సాధకులు, పాఠశాల విద్యార్థులతో సామూహికంగా యోగాసనాలు, కపాలభాతి, ప్రాణాయామం, యోగాసనాలు, ధ్యానం వంటి కార్యక్రమాలను చేయించారు. యోగా సాధకులు నృత్యంతో కూడిన యోగాసనాలు వేసి చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడారు. ప్రతేడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఏదో ఒక నినాదాన్ని పాటిస్తుందని, ఈ ఏడాది వ్యక్తిగత, సమాజం కోసం యోగా అనే నినాదాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. పూర్వం నాట్యంతో మానవాళికి ఎంతో నేర్పించారన్నారు. మొత్తం ప్రపంచానికి అంతటికీ గురువు భారతదేశమని కొనియాడారు. తనకు చిన్నతనం నుంచి మెడిటేషన్ చేసే అలవాటు ఉందని, రోజూ మెడిటేషన్ చేయనిదే బయటికి రానని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో యోగాలో గుర్తింపు పొందిన ప్రసన్నకు, రాష్ట్రస్థాయిలో బెస్ట్ ఇన్ఫ్లుయన్స్ స్టూడెంట్స్‌కు జ్ఞాపికలు అందించారు. జాతీయ యోగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, జిల్లా ఆయుష్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, డిఎస్‌డిఒ భూపతి రావు, డిపిఒ నాగరాజు నాయుడు, హౌసింగ్ పీడీ సిద్ద లింగమూర్తి, ఎపి స్టేట్ యోగా అసోసియేషన్ ఛైర్మన్ డి.లక్ష్మీకాంతరెడ్డి, సెట్కూర్ సిఇఒ రమణ, డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్, విద్యాశాఖ ఎడి శామ్యూల్ పాల్, ఎన్‌సిసి 28వ బెటాలియన్ అడ్మిన్ ఆఫీసర్ మేజర్ శశి కుమార్, కెవి.సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కెవి.సుబ్బారెడ్డి, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ టి.చంద్రశేఖర్ రెడ్డి, ద్వారం ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ కెవిఎస్.ప్రసాద్, స్కూల్స్ అండ్ గేమ్స్ సెక్రటరీ జోసెఫ్ లక్ష్మయ్య పాల్గొన్నారు. **కర్నూలు (క్రైమ్)** జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు యోగా చేశారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ... యోగా సాధన వల్ల కలిగే అనేక ప్రయోజనాల గురించి అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. యోగా నిపుణులు ఇంటర్నేషనల్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫ్యాకల్టీ ఫారూల్ కూరానా, కర్నూలు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫ్యాకల్టీ లంక నాగారాజు, అదనపు ఎస్పీలు నాగరాజు, నాగబాబు, మహిళా పిఎస్ డీఎస్పీ బాబు ప్రసాద్, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సిఐలు నాగరాజ్ యాదవ్, ఇంతియాజ్ బాషా, పవన్ కుమార్, కిరణ్ కుమార్ రెడ్డి, గౌతమి పాల్గొన్నారు. **సిబెళగల్** మండలంలో ముడుమాలలో ఇఒఆర్‌డి సందీప్, సర్పంచి చిన్న ఈరమ్మ, గ్రామ పెద్దలు సత్యారెడ్డి, రాముడు ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. యోగాతో ఏకాగ్రత, ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. **తుగ్గలి**, పెండేకల్లు, పగిడిరాయి జడ్‌పి పాఠశాలల్లో, అలాగే తుగ్గలి కెజిబివిలలో విద్యార్థులతో యోగా చేయించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు చందు నాయక్, పాండు, జయలక్ష్మి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సమయం ఉన్నప్పుడు యోగా చేయాలని తెలిపారు. యోగా చేయడం వల్ల మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు. **కర్నూలు (హాస్పిటల్)** నగరంలోని ఎక్యాంపులో ఉన్న మైపర్ ఫార్మసీ కళాశాలలో యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.రవి కుమార్ రెడ్డి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని, ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అండ్ వైస్ ప్రిన్సిపల్ కాసర్ల సురేష్ మాట్లాడుతూ... విద్యార్థులు రోజూ యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కర్నూలు నగరంలోని మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా గురువు శేషఫణిని సన్మానించారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్స్ క్లస్టర్ హెడ్ డాక్టర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు.



యోగా చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు





యోగా గురువును సన్మానిస్తున్న మెడికవర్ సిబ్బంది

విష్ణు టౌన్ షిప్‌లో తాగునీటి కుళాయిల్లో కలుషిత నీరు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో గల విష్ణు టౌన్ షిప్ కాలనీలో నెల రోజులుగా తాగునీటి కుళాయిల్లో కలుషిత నీరు వస్తున్నా సంబంధిత మున్సిపల్ ఇంజినీర్లు కన్నెత్తి కూడా చూడడం లేదు. మున్సిపల్ కుళాయిల ద్వారా వస్తున్న నీటితో స్నానం చేస్తే ఒళ్లంతా దురదలు వస్తున్నాయని కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.సునీల్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు కలుషితమై అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. శుక్రవారం ఆ కాలనీలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడారు. ఏడాదికి 15 శాతం ఇంటి పన్నులు పెంచుతున్న పాలకవర్గం, అధికారులు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయలేరా అని ప్రశ్నించారు. మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు స్పందించి పెరిగిన జనాభాకు అవసరమైన, అనుభవమున్న సిబ్బందిని నియమించాలని కోరారు. సంఘం ప్రతినిధి బృందం వెంటనే నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్‌ను కలిసి కలుషిత నీటికి సంబంధించిన ఫొటోలను చూపించారు. కలుషిత నీటిపై యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన అదనపు కమిషన్ సంబంధిత ఇంజినీర్‌కు ఫోన్ చేసి మరమ్మతులు చేపట్టి కలుషితమైన నీటిని అరికట్టి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. పిపిఎస్ఎస్ నగర నాయకులు కె.రంగస్వామి, వి.విజయ్, ఎ.వెంకటేశ్వర్లు, కె.సునీల్ కుమార్ పాల్గొన్నారు.



కలుషిత నీటిని చూపుతున్న నాయకులు

జొన్నగిరిలో వజ్రం లభ్యం

ప్రజాశక్తి తుగ్గలి

మండలంలోని జొన్నగిరి గ్రామంలో శుక్రవారం వజ్రం లభ్యమయింది. జొన్నగిరికి చెందిన ఒక రైతు తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా వజ్రం దొరికింది. ఈ వజ్రాన్ని జొన్నగిరికి చెందిన ఒక వ్యాపారి రూ.2.8 లక్షలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఇప్పటికే దాదాపు మండలంలో ఈఏడాది 40కిపైగా వజ్రాలు దొరికినట్లు సమాచారం. వర్షం పడితే మండలంలోని జొన్నగిరి, ఎర్రగుడి, పగిడిరాయి, చెన్నంపల్లి, తుగ్గలి, రాంపురం తదితర గ్రామాల్లో వజ్రాలు దొరుకుతుంటాయి. వజ్రాలను అన్వేషించడానికి ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు తండోపతండాలుగా వస్తుంటారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - పత్తికొండ

మండలంలోని చక్రాల జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు నీలకంఠ పాఠ్య పుస్తకాల పంపిణీ చేపట్టారు. ముఖ్యఅతిథిగా చక్రాల ఎంపిటిసి బోయ రాజు హాజరయి పాఠ్యపుస్తకాలు, బ్యాగ్స్, బూట్ల కిట్లను విద్యార్థులకు అందజేశారు. టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు ముని నాయుడు, టిడిపి నాయకులు పెద్ద లక్ష్మన్న, ఎర్ర రంగన్న, మట్టి రమేష్, పులికొండ పాల్గొన్నారు.

జిజిహెచ్‌కు ఈసీజీ మిషన్ విరాళం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు డాక్టర్ కోపర్తి రామ్మోహన్ ఈసీజీ మిషన్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చిన్నపిల్లల వార్డులో అత్యవసరమైన కేసులకు ఈసీజీ తీయడానికి మిషన్ లేకపోవడంతో డాక్టర్ శ్రీలత సూపరింటెండెంట్‌కి వాట్సాప్ ద్వారా తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ వెంటనే స్పందించగా డాక్టర్ రామ్ మోహన్ కొప్పర్తి ఎండి నియోనాటాలజిస్ట్, అడ్వకేట్ మెడికల్ గ్రూప్, చికాగో, యుఎస్ఎ వారు ఆసుపత్రికి విరాళం అందించారు. అనంతరం వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రిలో చిన్నపిల్లల కోసం అత్యాధునిక ఈసీజీ మిషన్ చిన్న పిల్లల విభాగపు ప్రొఫెసర్ డాక్టర్ శారదకి అందించినట్టు తెలిపారు. ఆసుపత్రిలో త్వరలో న్యూ ఎఎంసి విభాగానికి అత్యాధునిక వైద్య పరికరాలు డాక్టర్ రంగా రెడ్డి, 1964 బ్యాచ్ వారు 12 ఈసిజి మానిటర్‌లు, వీటి విలువ రూ. 12 లక్షల విలువ గల వైద్య పరికరాలు డొనేషన్ చేయడానికి అంగీకరించినట్లు, త్వరలో అందుబాటులోకి వస్తాయి అని తెలిపారు. ఆసుపత్రిలో త్వరలో నూతన క్యాజువాలిటీ విభాగానికి 20 పడకలు మరియు రెన్నోవేషన్‌కు కేవీ సుబ్బారెడ్డి కాలేజ్ అధినేత.కె.వి.సుబ్బారెడ్డి విరాళం ఇవ్వడానికి అంగీకరించినట్లు తెలిపారు. ఆసుపత్రికి విరాళం ఇచ్చిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ శారద, ఆసుపత్రి ఏఆర్ఎం, డాక్టర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి రామోజీరావు

- ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో సంతాప సభ

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

పత్రిక రంగంలో ఎనలేని కృషి చేసిన కలం యోధుడు, మహోన్నత వ్యక్తి పద్మవిభూషణ్, ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు అని మాజీ సీనియర్ జర్నలిస్టు, లలిత కళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. శుక్రవారం ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో లలిత కళా సమితిలో రామోజీరావు సంతాపసభ నిర్వహించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర అధ్యక్షత వహించారు. ముందుగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓబులయ్య మాట్లాడారు. తెలుగు పాఠకులను మంత్ర ముగ్ధుల్ని చేసిన ఈనాడు దినపత్రిక పత్రిక రంగంలో ప్రత్యేకతను చాటిందని తెలిపారు. పాఠకుల అభిమానాన్ని సంపాదించుకున్న రామోజీరావు దేశంలోనే ప్రముఖ స్థానాన్ని సంపాదించారని చెప్పారు. తాను 25 ఏళ్ల పాటు ఈనాడు పత్రికల్లో పని చేశానని, సంస్థతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సేవా కార్యక్రమాల్లో కూడా రామోజీ సంస్థలు కృషి చేశాయని కొనియాడారు. ఈనాడు పత్రిక వల్లే తనకు గుర్తింపు వచ్చిందని తెలిపారు. గీతాంజలి గ్రూప్ సంస్థల అధినేత పెరుగు విజయవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... నీతి, నిజాయితీకి, సంస్కారానికి నిదర్శనం రామోజీరావు అని తెలిపారు. తెలుగు జర్నలిజానికి పర్యాయపదం రామోజీ అని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. విలువలు, క్రమశిక్షణ ఆయన విజయ రహస్యమన్నారు. నిబద్ధతకు మారు పేరుగా నిలిచారని తెలిపారు. గొప్పవ్యక్తిత్వంతో సేవ చేయడానికి ప్రధాన కారణం వామపక్ష భావజాలంతో ఉన్న మిత్రులుండడం ఆయనకు అదనపు ఆస్తి అన్నారు. నాగేంద్ర మాట్లాడుతూ... సమాజ మార్పు కోసం ఆయన చేసిన పోరాటం కీర్తించదగినదని తెలిపారు. పాత్రికేయ విలువలకు అద్దం పట్టిన రామోజీ చిరస్మరణీయులని ఈనాడు స్టాఫ్ రిపోర్టర్ రామకృష్ణ చెప్పారు. ఈటీవీ స్టాఫ్ రిపోర్టర్ శ్యామ్, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా నాయకులు బసప్ప, వినయ్ కుమార్, రచయిత బసవరాజు, ఈనాడు సీనియర్ జర్నలిస్ట్ ఆంజనేయులు, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు సుజాత, బ్రహ్మయ్య, వెంకటేష్, దామోదర్, ఎర్రమల, మధు, రఫీ, ఈటీవీ కెమెరామేన్ శేష ఫణి, ఫొటోగ్రాఫర్ శైలేష్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పత్తి ఓబులయ్య, నాయకులు

23న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో గోపాలం శివన్నారాయణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఛైర్మన్ కె.ప్రభాకర్ రెడ్డి, కన్వీనర్ బి.రామాంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23న ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కర్నూలు నగరంలోని ఇందిరా గాంధీ నగర్‌లో ఉన్న సుందరయ్య భవన్‌లో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు వివిధ జబ్బులతో బాధపడుతూ వేలాది రూపాయలు ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఖర్చు పెడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అలాంటి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ ఉచిత వైద్య శిబిరాలు ఉపయోగపడతాయని తెలిపారు. కర్నూలు నగరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో ప్రముఖ డాక్టర్లు పాల్గొని వైద్య సేవలు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ శిబిరంలో బిపి, షుగర్, పక్షవాతం, ఫిట్స్ వంటి వ్యాధులకు వైద్యం అందజేయడంతోపాటు వ్యాధిగ్రస్తులకు కేవలం రూ.200లకే రెండు నెలలు సరిపడే మందులు అందజేస్తారని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న మల్లప్ప

పంతం నెగ్గించుకున్న బాబు

- జనసేన ఇన్‌ఛార్జి మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని

ముఖ్యమంత్రిగానే శాసనసభలో అడుగు పెడతానని చేసిన శపథాన్ని నెగ్గించుకున్న ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కిందని జనసేన ఇన్‌ఛార్జి మల్లప్ప కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు రేణు వర్మ, సీనియర్ నాయకులు గాజుల రాజశేఖర్, నెల్లిబండ రాజశేఖర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అసెంబ్లీలో మొదటిసారిగా ఎమ్మెల్యేలుగా పవన్ కల్యాణ్, డాక్టర్ పార్థసారథి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సిరుగుప్ప రోడ్డులోని గుంతలను మట్టితో పూడ్చి రూ.25 వేల వ్యయంతో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యక్తిగత దూషణలతో సభ మర్యాదను మంటలో కలిపి వైసిపి నాయకులు శునకానందం పొందారని విమర్శించారు. కుటుంబాన్ని కించపరిచిన చంద్రబాబులోని వ్యక్తి కంటతడి పెట్టుకున్నారంటే ఎలా హింసించారో అప్పుడే ప్రజలు గ్రహించారని తెలిపారు. అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వమని పవన్ కల్యాణ్‌పై ఆరోపణలు చేసిన వారు ఇంటి గేటు కే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. ప్రజా సమస్యలు, పరిపాలన లోపాలు మాత్రమే సభలో చర్చించాలని, వ్యక్తిగత దూషణలు వద్దని చంద్రబాబు ఆదేశిస్తూ తన గొప్పతనాన్ని పెంచుకున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో సాగు, తాగునీటి కొరత రాకుండా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కూటమిలో నాయకుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని తెలిపారు. భూ కబ్జాలు, అక్రమాల వల్ల నష్టపోయిన బాధితులు ముందుకొస్తే అధికారులతో సంప్రదించి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, జనసేన మల్లప్ప పేరు చెప్పి కొందరు అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. జనసేన నాయకులు పులిరాజు, ప్రకాష్, శ్రీనివాసులు, జయరాం, వెంకటేష్, శాంత, తరుణ్ ఉన్నారు.

విగ్రహం ఏర్పాటు నిధిలో పారదర్శకత ఏది..?

- భక్తి పేరుతో భుక్తికి సన్నాహాలేనా..? - రూ.300 కోట్లతో ప్రతిపాదనలు

- ఏడాదయినా సాగని నిర్మాణాలు - శ్రీమఠం ఆధీనంలోని 10 ఎకరాల భూమి కేటాయింపు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం సమీపంలో రూ.300 కోట్లతో 108 అడుగుల శ్రీరాముని పంచలోహ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. వర్చువల్ విధానం ద్వారా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భూమిపూజ కూడా చేశారు. పలువురు ప్రముఖులు ఈ భూమిపూజలో పాల్గొన్నారు. విగ్రహం ఏర్పాటు పనులు ఆలస్యం అవుతుండడంతో పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా మంత్రాలయం సమీపంలో ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం సమీపంలో రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో 108 అడుగుల శ్రీరాముని పంచలోహ విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ఈ విగ్రహం ఏర్పాటుకు జరుగుతున్న ఆలస్యంపై భక్తుల నుంచి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'జై శ్రీరామ్' ఫౌండేషన్ పేరుతో నిర్మాణాలు చేపట్టడం వెనుక లాభాపేక్ష ఉందని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఫౌండర్లు తెలంగాణకు చెందిన మద్ది పట్టాభిరామ్ శ్రీధర్, కమ్మర రాము, కపిలవాయి రవిందరల ఆధ్వర్యంలో జులై 23, 2023న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతులమీదుగా వర్చువల్ విధానం ద్వారా ఈ కార్యక్రమానికి భూమిపూజ చేశారు. ముఖ్య అతిథులుగా శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు, ఎంపీ టిజి.వెంకటేష్, బిజెపి ఆదోని డివిజన్ ఇన్‌ఛార్జి, హైకోర్టు న్యాయవాది బి.పురుషోత్తం రెడ్డి, వైసిపి యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, నాటి టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు, నాటి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, నేటి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ విగ్రహం ఏర్పాటులో తమ సహకారం ఉంటుందని తెలిపారు. పురోగతిపై పారదర్శకత, స్పష్టత లేకపోవడంతో పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఈటెల రాజేందర్, ఎంపీ టిజి.వెంకటేష్, తెలంగాణ ఎంపీ, ప్రస్తుత కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్, ఇతర రాజకీయ నాయకుల పేర్లతో, ఫొటోలతో బ్రోచర్ల ద్వారా ప్రచారం చేయడం వెనుక గల ఆంతర్యం ఏమిటని నిలదీస్తున్నారు. ఇందులో వీరి పాత్ర ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. వారు ఈ ట్రస్టులో భాగస్వాములుగా లేక దాతలా లేక భక్తులుగా ఉపయోగించుకున్నారా అనే విషయం తెలియాల్సి ఉంది. ఏడాది అవుతున్నా మట్టితో రోడ్డు వేసి, చిన్నపాటి పనులు చేశారు. తప్ప ఎలాంటి పురోగతి లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దేశంలో ఉన్న రాఘవేంద్ర స్వామి మఠానికి చెందిన పీఠాధిపతులు సంస్కర్తలకులగా ఉన్న పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల వారి పాత్ర ఏమిటి..? ప్రజా సంక్షేమం, ప్రజావసరాల కోసం నిర్మించే ప్రభుత్వ కార్యాలయాలకు, ఆస్పత్రి, విద్యాలయాలకు, పేదల ఇంటి స్థలాల మంజూరుకు నిబంధనల పేరుతో శ్రీమఠం వారు అడ్డంకులు చెబుతుంటారు. కానీ విగ్రహం ఏర్పాటు 10 ఎకరాల భూమి కేటాయింపునకు శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులకు ఆ నిబంధనలు అడ్డు రాలేదా అని


విగ్రహం ఏర్పాటుకు కేటాయించిన భూమి

గ్రామస్తుల నుంచి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విగ్రహం ఏర్పాటుకు ఇప్పటివరకు దాతల నుంచి వచ్చిన విరాళాల వివరాలు మీడియా ద్వారా తెలపాలని, జవాబుదారి తనంతో నడుచుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యతతో మారు పేరుగా నిలిచి శ్రీరాముని భక్తులుగా కీర్తి నిలుపుకొని భక్తుల కోసం కాకుండా భక్తి కోసం ఈ బృహత్ కార్యాన్ని చేపట్టినట్లు నిరూపించుకోవాలని భక్తులు సూచిస్తున్నారు. ఈ విషయంపై ఫౌండర్ మద్ది పట్టాభిరామ శ్రీధర్‌ను వివరణ కోరగా... 'ఇది చాలా పెద్ద ప్రాజెక్టు. కనీసం ఐదేళ్ల పడుతుంది. జైశ్రీరామ్ ఫౌండేషన్ ట్రస్టులో పీఠాధిపతులతో పాటు చాలామంది రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు సభ్యులుగా ఉన్నారు. అందరి సహకారంతో నిధులు సమీకరించే ప్రయత్నం చేశాం. ఎన్నికల సందడి ఉండడంతో సరిగా స్పందన లేదు. సొంత ఖర్చులతో ఇటీవల పనులు మొదలు పెట్టాం. వర్షాల కారణంగా కొంత ఆలస్యం జరుగుతోంది. ఇసుక కొరత ఉండడం వల్ల కొంత జాప్యం జరుగుతోంది. నిధి సేకరణ అనంతరం పనులు వేగవంతం అవుతాయి.' అని వివరించారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజల ఆశీస్సులతో బాలనాగిరెడ్డి గెలుపు

- వైసిపి మండల అధ్యక్షులు భీమిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజల ఆశీస్సులే ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డిని గెలిపించాయని వైసిపి మండల అధ్యక్షులు భీమిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి నాలుగోసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా సర్పంచి భీమయ్య ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలోనే మంచి రోజులు వస్తాయని, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఎవరూ అధైర్య పడవద్దని సూచించారు. బాలనాగిరెడ్డి గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఏదైనా ఇబ్బంది అనిపిస్తే వై.సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, వై.ధరణి రెడ్డితో పాటు ఆయా మండలాల, గ్రామాల నాయకుల దృష్టికి తీసుకురావాలని కోరారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్ పాల్గొన్నారు.

మంత్రి టిజిని కలిసిన ఎమ్మెల్యే బీవీ


టిజి.భరత్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్‌ను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి శుక్రవారం కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. తమ ప్రాంతానికి కావాల్సిన పరిశ్రమలు, అనుకూల వాతావరణం తదితర అంశాలను మంత్రి టిజి.భరత్ దృష్టికి తీసుకెళ్లినట్లు బీవీ తెలిపారు. ఎమ్మిగనూరు ప్రాంత అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని మంత్రి టిజి.భరత్ హామీ ఇచ్చారు.

జనసేన సైనికులకు మంచి రోజులు

- ఇన్‌ఛార్జి వాల్మీకి లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

జనసైనికులకు మంచి రోజులు వచ్చాయని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.లక్ష్మన్న పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని ఆయన స్వగృహం వద్ద జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదుర్కొని నేడు రాష్ట్రంలో, కేంద్రంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ ఉన్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని, అందుబాటులో ఉంటామనని చెప్పారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మళ్లీ తనకే బాధ్యతలు అప్పగించి లెటర్ ప్యాడ్‌ను ఇచ్చినట్లు తెలిపారు. లక్ష్మన్నను శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. నాయకులు బివి.రవిచంద్ర, దుళ్లయ్య, వన్నూరు చిన్న, షర్ఫుద్దీన్, అలీబాషా, అబ్రహాం, ఏసు, మున్ను, మంజునాథ, సుమిత్ర, వీరారెడ్డి, కరీమ్ సాబ్, రాజేంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ఉన్న కన్నడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూకప్ప ఆధ్వర్యంలో, సర్పంచి రాము సమక్షంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవేంద్రప్ప, టిడిపి మండల అధ్యక్షులు బసవరాజ్, టిడిపి సీనియర్ నాయకులు ఆదిశేషిరెడ్డి, నాగరాజ్, నాగప్ప, వైసిపి సీనియర్ నాయకులు వీరేశప్ప, కుప్పలదొడ్డి గర్జప్ప, గ్రామ ఉప సర్పంచి ఢాబా మల్లిరెడ్డి, మీసేవ నాగరాజు, తిప్పన్న ఆధ్వర్యంలో ఈ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం కూటమి నాయకులు మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి, మండలానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బిజెపి నాయకులు రంగారెడ్డి, నాగరాజు, మానప్ప, గర్జప్ప, అశోక్, మంజు, బసప్ప పాల్గొన్నారు.



యోగాతో మానసిక ప్రశాంతత

- తెలుగు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ సాబ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రతిఒక్కరిలోనూ మానసిక ప్రశాంతత పెంచేందుకు యోగా దోహదపడుతుందని పెద్దహరివాణం తెలుగు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ సాబ్ తెలిపారు. శుక్రవారం యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక పాఠశాలలో విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో ప్రతిఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారని, అలాంటి ఒత్తిళ్ల నుంచి బయట పడేందుకు యోగా దోహదపడుతుందని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో యోగాసనాలు వేయించి సుమారు గంటన్నర పాటు యోగా సాధన చేశారు. సిఆర్‌పి హుస్సేనప్ప, ఉపాధ్యాయులు టి.రాజ్యలక్ష్మి, ఎస్.శైలజ, షకీరాబేగం, విద్యార్థులు పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయులు రామన్న యోగాలోని కొన్ని ఆసనాలను చేసి విద్యార్థులకు చూపించారు. ప్రధానోపాధ్యాయులు హంపయ్య మాట్లాడుతూ... యోగా వల్ల శారీరక దృఢత్వం పెంపొంది మనస్సు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. ఏకాగ్రతతో విద్యలో రాణించగలరని పేర్కొన్నారు. ధ్యానం గురించి ఉపాధ్యాయులు శ్రీనివాసులు వివరించారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విఠోబా, గోపాల్, బసవరాజు ఉమామహేశ్వరి, సుభాషిని, ప్రసన్న, రామకృష్ణ, హరి, పుష్పలత, ఈరన్న పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలి

- ఎంవిఐకి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఆదోని


ఎంవిఐకి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఫిట్‌నెస్ బస్సులు నడిపే ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గౌస్, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోని ఆర్‌టిఒ కార్యాలయంలోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సరైన ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ప్రతి స్కూల్ బస్సుకు డ్రైవర్‌తోపాటు క్లీనర్ ఏర్పాటు చేసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మోహన్, సూరి, యశ్వంత్, రవితేజ, నరసింహ, మహేష్ పాల్గొన్నారు.

నగరడోనాలో దుర్వాసన

- అంగన్వాడీ కేంద్రం దగ్గరే దుర్వాసన

వెదజల్లుతున్నా పట్టించుకోని అధికారులు

- ఇబ్బంది పడుతున్న చిన్నారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నగరడోనా అంగన్వాడీ-2 సమీపంలో మురుగునీరు ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అంగన్వాడీకి వచ్చే చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


గరడోనా అంగన్వాడీ కేంద్రం దగ్గర ఉన్న మురుగు

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల దగ్గర పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వాలు, ఉన్నతాధికారులు పదేపదే చెబుతున్నారు. కిందిస్థాయి అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మండలంలోని చాలా గ్రామాల్లో డ్రైనేజీలో మురుగునీరు పేరుకుపోయినా శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెంది అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని తెలిసినా సంబంధిత అధికారులు పెడచెవిన పెడుతున్నారు. నగరడోనా గ్రామంలో బస్టాండ్ పక్కనే ఉన్న అంగన్వాడీ కేంద్రం-2 దగ్గరనే డ్రైనేజీ అంతా దుర్వాసనతో నిండిపోయింది. దుర్వాసనకు అంగన్వాడీ కేంద్రానికొచ్చే చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీలో పందులు దొర్లినప్పుడల్లా ఆ వాసనకు బయటికి రాలేకపోతున్నామని మహిళలు ఆవేదన చేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రం పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రతగా ఉంచుకోవాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కానీ ఇక్కడ ఒక నెల అవుతున్నా డ్రైనేజీని అలానే వదిలేస్తున్నారని కాలనీవాసులు తెలుపుతున్నారు. డ్రైనేజీలో ఉన్న మురుగును శుభ్రం చేయించి దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలని మహిళలు కోరుతున్నారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం

- కురువ వెంకటేష్, కాలనీవాసి



డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగు వల్ల దుర్వాసన వస్తోంది. అంగన్వాడీ పిల్లలకు, కాలనీలోని కుటుంబాలకు ఇబ్బందిగా ఉంది. అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీని శుభ్రం చేయాలి.

బడి పిలుస్తుంది రా....!

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఐదేళ్లలోపు పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి రావాలని అంగన్వాడీ పర్యవేక్షకులు పుష్పవతి తెలిపారు. శుక్రవారం కపటి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో 'బడి పిలుస్తుంది రా' కార్యక్రమం అంగన్వాడీ కార్యకర్తలు రిజ్వానా, అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారులను పిల్లలకు అందించి సద్వినియోగం చేసుకోవాలని పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.



మాజీ ఎమ్మెల్యే అక్రమాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూదందాలు, కబ్జాలు, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీ, మెడికల్ కళాశాల కోసం సేకరించిన భూముల వ్యవహారంలో కోట్లాది రూపాయలు అక్రమాలు జరిగాయని తెలిపారు. ఆదోని శివారులోని 352 సర్వే నెంబర్‌లో ప్లాట్లు కొనుగోలు వ్యవహారం, బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం సేకరించిన భూమి వ్యవహారంలో కోట్ల రూపాయల అక్రమాలు జరగాయని ముఖ్యమంత్రి బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ అధికారుల సహకారంతో భూముల కబ్జా జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు కబ్జాకు గురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అక్రమ ఆస్తులపై సిబిఐ లేక సిఐడి విచారణ చేయించాలని కోరినట్లు తెలిపారు. చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

బ్లీచింగ్ పౌడర్ చల్లించిన సర్పంచి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని నారాయణపురం సర్పంచి అల్లమ్మ గారి సరళమ్మ, అల్లమ్మ గారి పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో వీధివీధి తిరిగి పారిశుధ్య కార్మికుల చేత బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మురుగు కాలువ దగ్గర నీరు నిల్వ లేకుండా శుభ్రం చేయాలని, దోమలు వృద్ధి చెందకుండా, అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా బ్లీచింగ్ పౌడర్ చల్లించినట్లు తెలిపారు. అలాగే తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించామని చెప్పారు. గ్రామస్తులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

ఎస్ఐ, కానిస్టేబుల్‌ను బదిలీ చేయాలి

- న్యాయవాది చంద్రయ్య

ప్రజాశక్తి - ఆదోని

పెద్దకడబూరు పోలీసు స్టేషన్ ఎస్ఐ డి.మహేష్ కుమార్, కానిస్టేబుల్ నాగరాజును బదిలీ చేయాలని న్యాయవాది డి.చంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆదోనిలో విలేకరులతో మాట్లాడారు. పెద్దకడబూరు పోలీసు స్టేషన్‌లో వైసిపి నాయకుల ఆదేశాల మేరకే పోలీసులు పని చేస్తున్నారని విమర్శించారు. స్టేషన్‌కు వచ్చిన బాధితులకు లేనిపోని మాటలు చెప్పి భయభ్రాంతులకు గురిచేయడం, బాధితుల నుంచి వచ్చినకాడికి దండుకోవడం రోజువారీ దినచర్యగా మారిందని తెలిపారు. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో 41 ఎసిఆర్‌పిసి నోటీసు కేసులో నిందితులకు ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. వాటిని తుంగలోకి తొక్కి పెద్దకడబూరు ఎస్ఐ స్టేషన్ బెయిల్ విషయంలో అందినంత దండుకోవడం, అనుకున్నంత డబ్బులు ఇవ్వకపోతే తప్పుడు సెక్షన్లు పెట్టి జైలుకు పంపడం చేస్తున్నారని విమర్శించారు. పెద్దకడబూరు పోలీసు స్టేషన్ పరిధిలో దొడ్డిమేకల గ్రామానికి చెందిన బిఎం.ఈరన్న, ఉరుకుందు కలిసి తమ పొలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని ఫిర్యాదు చేస్తే నిందితులపై కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసు క్రైమ్ నెంబర్ 56/2024గా ఉందని, వెంటనే కేసులో నిందితులను పోలీసు స్టేషన్‌కు రప్పించి నిందితుల ద్వారా ఫిర్యాదును స్వీకరించి బాధితులపై తప్పుడు ఆరోపణలతో కౌంటర్ కేసు నమోదు చేయించారని తెలిపారు. ఈ కేసులో బాధితుల్లో బిఎం.ఉరుకుందు కుమారుడు ప్రభుత్వ ఉద్యోగి (బడిపంతులు) అని, ఈయనను రెండో నిందితునిగా కేసులో చూపించారని అన్నారు. ఉద్యోగరీత్యా వేరే ఊళ్లో పని చేస్తున్నారని తెలిపారు. సంఘటన జరిగిన స్థలంలో లేకపోయినా రెండో నిందితునిగా చేర్పించి బాధిత కుటుంబ సభ్యులను పోలీసు స్టేషన్‌కు రప్పించి భయభ్రాంతులకు గురి చేశారని చెప్పారు. కేసులో నిందితునిగా ఉంటే ఉద్యోగం నుంచి సస్పెన్షన్‌కు గురికావాల్సి వస్తుందని, స్టేషన్ బెయిల్ ఇవ్వాలంటే పోలీసు స్టేషన్‌లో పని చేసే సిబ్బంది, ఎస్ఐ, అదే స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ నాగరాజు భాగస్వామ్యంతో డబ్బులు ముట్ట చెప్పాలని హుకుం జారీ చేశారని తెలిపారు. బాధితులు డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించినందుకు పోలీసు సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే బాధితులు న్యాయవాదిని ఆశ్రయించి గత నెల 24న ఎస్ఐకి, ఉన్నతాధికారికి లీగల్ నోటీసు ఇచ్చారని తెలిపారు. బాధితుల తరపున ఎపి హైకోర్టు అమరావతిని ఆశ్రయించి రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. క్రైమ్ నెంబర్ 56/2024 కేసులో నిందితులు, పెద్దకడబూరు ఎస్ఐని ప్రతివాదిగా చేర్పించి హైకోర్టులో దాఖలు చేశారన్నారు. హైకోర్టు సుదీర్ఘంగా



విచారణ చేసి, రిట్ పిటిషన్‌లో ఉత్తర్వులు బాధితులకు అనుకూలంగా వచ్చాయని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను జీర్ణించుకోలేక ఎస్ఐ రెండో నిందితుడు ఉపాధ్యాయులు బి.నాగరాజును సస్పెన్షన్ చేయాలని పెద్దకడబూరు ఎంఇఒకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పెద్దకడబూరు ఎస్ఐ గతంలో పనిచేసిన నందవరం పోలీసు స్టేషన్‌లో కూడా చాలా ఆరోపణలు రావడంతో పోలీసు ఉన్నతాధికారులు విఆర్‌కు పంపారన్నారు. గత ప్రభుత్వంలో రాజకీయ నాయకుల అండదండలతో పెద్దకడబూరు పోలీసు స్టేషన్‌కు తన స్థానం పదిలం చేసుకున్నారని తెలిపారు. కేసులో నిందితులకు రాజకీయంగా పలుకుబడి ఉందని, వారికి వత్తాసుగా ఉన్న పెద్దకడబూరు ఎస్ఐ, కానిస్టేబుల్ నాగరాజు తక్షణమే విధుల నుంచి తప్పించి నిష్పక్షపాతంగా విచారించి చట్టపరంగా చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.


ఎస్ఐ మహేష్ కుమార్ వివరణ

'అసత్య ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. న్యాయవాది చంద్రయ్యను ఒక కేసులో అరెస్టు చేసి రిమాండ్ చేశాం. అది మనసులో ఉంచుకొని ఇలా ప్రచారం చేస్తున్నారు. మేమెలాంటి సివిల్ పంచాయితీలు చేయడం లేదు' అని ఎస్ఐ మహేష్‌కుమార్ వివరించారు.

జిఒ 117ను రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - నందవరం

ప్రభుత్వ విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేస్తూ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న జిఒ 117ను తక్షణమే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు, జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కౌన్సిలర్ దావీదు, దేవపాల్, జె.ఎల్లప్ప కోరారు. శుక్రవారం నందవరంలోని వివిధ ప్రాథమిక పాఠశాలలను యుటిఎఫ్ మండల అధ్యక్షులు వెంకట రాముడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో సందర్శించారు. ఉపాధ్యాయుల సంరక్షణ కోసం పాటుపడుతూ, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న యుటిఎఫ్ సభ్యత్వం తీసుకొని సభ్యులుగా చేరాలని కోరారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యారంగంలో సంస్కరణల పేరుతో గత ప్రభుత్వం అమలు చేసిన జిఒ 117తో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. పాఠశాలలను విలీనం చేయడం వల్ల ప్రాథమిక పాఠశాల వ్యవస్థ బలహీనపడిందన్నారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాల్సి వస్తుందన్న కారణంతో ఎస్‌జిటి పోస్టులను రద్దు చేశారని, రాష్ట్రంలో 14వేల ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలాయని తెలిపారు. పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం మాత్రమే అమలు చేయడం వల్ల చాలామంది విద్యార్థులు పాఠశాలలను విడిచిపోవాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలలో రెండు సమాంతర మీడియాలు కొనసాగించి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సీనియర్ నాయకులు విరుపాక్షి, దుబ్బన్న, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలి నాగరాజు, వెంకటరాముడు, మండల నాయకులు ఉసేని, నరసింహులు, భాగ్యరాజు, రాజు, నాగరాజు, సురేష్, మహేష్, వీరభద్రయ్య పాల్గొన్నారు.



జిఒపై చర్చిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా బుట్టా రేణుక పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాజీ ఎంపీ, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుట్టా రేణుక 53వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎమ్మిగనూర్ వైసిపి కార్యాలయంలో బుట్టా రేణుక పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. బుట్టా నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బుట్టా ఫౌండేషన్ మేనేజర్ చరిత ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ వారికి రక్తదానం చేశారు.

భవిత వికలాంగుల కేంద్రంలో : వైసిపి సోషల్ మీడియా ఆధ్వర్యంలో పట్టణంలోని భవిత వికలాంగుల కేంద్రంలో బుట్టా రేణుక పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. బుట్టా ఫౌండేషన్ మేనేజర్ చరిత, బాబు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న నాయకులు


వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

తూతూమంత్రంగా వేలం పాటలు


- మేజర్ పంచాయతీకి తగ్గిన ఆదాయం

ప్రజాశక్తి - కోసిగి

కోసిగి మేజర్ పంచాయతీ పరిధిలోని ఆదాయ వనరుల నిర్వహణకు శుక్రవారం జరిగిన వేలం పాటలు తూతూమంత్రంగా ముగిశాయి. అధికారులు ముందుగా వెల్లడించినట్లు ఏడాది కాల పరిమితికి కాకుండా 9 నెలల వ్యవధి కోసం వేలం పాటలు నిర్వహించడంతో ఆదాయం గణనీయంగా తగ్గింది. ఎన్నికల కోడ్ కారణంగా ఇప్పటికే మూడు నెలల కాలం గడిచిపోయింది. మేజర్ పంచాయతీ సర్పంచి ఎస్.ఆయ్యమ్మ అధ్యక్షతన డిఎల్‌పిఒ నూర్జహాన్ ఆధ్వర్యంలో పంచాయతీ వేలంపాట నిర్వహించారు. జులై 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు రుసుములు వసూలు చేసుకునే హక్కులకు వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో వారపు సంతను చింతలగేని నర్సారెడ్డి రూ.1.30 లక్షలకు, బండిమెట్ట రూ.6.90 లక్షలకు, చిన్న కమేలాను నూర్ అహ్మద్ రూ.31 వేలకు, పెద్ద కమేలాను ఎస్.రాజేష్ రూ.20 వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు. సిండికేట్ వ్యవహారం ఫలించకపోవడంతో గుత్తేదారులు పోటీ పడినా పంచాయతీ ఆదాయం మాత్రం ఆశించనంత స్థాయిలో పెరగలేదు. డిఎల్‌పిఒ నూర్జహాన్ మాట్లాడుతూ... ప్రతేడాది ఏప్రిల్‌లో నిర్వహించాల్సిన వేలాన్ని ఈ ఏడాది ఎన్నికల కోడ్ కారణంగా నిర్వహించలేకపోయామని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి ఆదాయం పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా కోసిగి ఎస్ఐ సతీష్ కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎంపిపి లవకుశ ఈరన్న, ఇఒఆర్‌డి హరుణ్ రషీద్, పంచాయతీ ఇఒలు చంద్రశేఖర్, తిరుమలేశ్వర్ రెడ్డి, వేలంపాటదారులు మాణిక్యరాజు, హోళగుంద కోసిగయ్య, నాడిగేని నాగరాజు, ముకుంద కృష్ణమూర్తి, మురళీకృష్ణ రాజు దొర, మాజీ జడ్‌పిటిసి జె.వెంకటేష్, వక్రాణి వెంకటేశులు, నాడిగేని అయ్యన్న, మధు పాల్గొన్నారు.

పారదర్శకంగా డిప్యూటేషన్ చేపట్టాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

పట్టణంలోని మున్సిపల్ స్కూల్ విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని యుటిఎఫ్ పట్టణ గౌరవాధ్యక్షులు సునీల్ కుమార్ కోరారు. శుక్రవారం ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒ రాజేంద్రప్రసాద్‌తో యుటిఎఫ్ నాయకులు సమావేశమై ఆయనతో చర్చలు జరిపారు. మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించడంతో పాటు పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. గతంలో డిప్యూటేషన్లు జరపడంతో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నచోట ఉపాధ్యాయులను తక్కువగా కేటాయించడంతో అక్కడ పాటలు బోధించే ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ... ఈ సమస్యలను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. యుటిఎఫ్ నాయకులు మల్లికార్జున, జగన్మోహన్ రావు, రిషికేష్, బాల వర్ధన్, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

అనే నేను...

- ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

శాసనసభ్యులుగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన 14 మంది గురువారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. వారి చేత అసెంబ్లీ ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 11 మంది టిడిపి ఎమ్మెల్యేలు, ఇద్దరు వైసిపి ఎమ్మెల్యేలు, ఒక బిజెపి ఎమ్మెల్యే గెలుపొందిన సంగతి తెలిసిందే. పాణ్యం ఎమ్మెల్యేగా గౌరు చరితా రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యేగా మంత్రి ఎన్ఎండి ఫరూక్, బనగానపల్లె ఎమ్మెల్యేగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, డోన్ ఎమ్మెల్యేగా కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా భూమా అఖిలప్రియ, శ్రీశైలం ఎమ్మెల్యేగా బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యేగా గిత్త జయసూర్య అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. కర్నూలు ఎమ్మెల్యేగా మంత్రి టీజీ భరత్, కోడుమూరు ఎమ్మెల్యేగా బొగ్గుల దస్తగిరి, పత్తికొండ ఎమ్మెల్యేగా కెఇ శ్యాం కుమార్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఆదోని ఎమ్మెల్యేగా వాల్మీకి పార్థసారధి, మంత్రాలయం ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యేగా బుసినే విరూపాక్షి ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాలను జిల్లా వాసులు టివిలు, సామాజిక మాధ్యమాల ద్వారా వీక్షించారు.


డోన్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి


బనగానపల్లె ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న బిసి జనార్ధన్ రెడ్డి


నంద్యాల ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎన్ఎండి.ఫరూక్


ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న భూమా అఖిలప్రియ


శ్రీశైలం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న బుడ్డా రాజశేఖర్ రెడ్డి


నందికొట్కూరు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గిత్త జయసూర్య


పాణ్యం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గౌరు చరితా రెడ్డి

టమో(త)టా

- రూ.వందకు చేరిన ధర
- ఇతర కూరగాయలు అదే దారిలో



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. టమోట ధర కిలో ఏకంగా రూ.వందకు చేరింది. ఇతర కూరగాయలు కూడా అదే దారిలో పరుగిడుతున్నాయి. డిమాండుకు సరిపడా సరఫరా లేకపోవడంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు...

కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల రేట్లు చుక్కల్లో చేరాయి. టమోట కిలో ఏకంగా రూ.వందకు చేరింది. వర్షాకాలం ప్రారంభంకావడంతో పంట ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. దీంతో అన్నిరకాల ధరలకు రెక్కలొచ్చాయి. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక్కరోజు కూరగాయలకు కనీసం రూ.150పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలో ఏ రోజుకా రోజు కూరగాయలు కొనుగోలు చేయడం ఎక్కువ. దీంతో చాలా మంది తోపుడుబండ్ల తో కాలనీల్లో తిరుగుతూ కూరగాయలు విక్రయిస్తుంటారు. కానీ వాటి ధరలు అధికంగా ఉండటంతో తోపుడు బండ్ల వారు రావడమే మానేశారు. కర్నూలు మార్కెట్ యార్డుకు స్థానిక రైతులు పండించిన కూరగాయలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కూడా కూరగాయలు వస్తున్నాయి. వాటిని కొందరు కొనుగోలు చేసి రైతు బజార్లలో విక్రయిస్తుంటారు. స్థానికంగా టమోటా దిగుబడి సరిగ్గా లేకపోవడంతో కర్నూలు మార్కెట్‌కు మదనపల్లి, మొలకలచెరువు నుంచి టమోటాలు వస్తున్నాయి. ప్రస్తుతం స్థానికంగా మిర్చి పంట లేకపోవడంతో కర్ణాటకలోని బెళగాం నుంచి మిర్చి వస్తోంది. వంకాయ, క్యారెట్, క్యాబేజీ, ఆలూ, చెవులేకాయ వంటి కూరగాయలు స్థానికంగా చుట్టు పక్కల ప్రాంతాల రైతులు తీసుకువస్తున్నారు. డిమాండుకు సరిపడా సరుకు రాకపోవడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. కర్నూలు నగరంలో గత నెలలో రూ.40 నుంచి రూ.50 వరకూ ఉన్న కిలో టమోటా ప్రస్తుతం రూ.వంద పలుకుతోంది. టమోటాతో పాటు అన్ని కూరగాయల ధరలు పెరిగిపోయాయి. మొన్నటి వరకూ కిలో రూ.40 ఉన్న వంకాయ రూ.80, రూ.40 ఉన్న బెండ రూ.60కు, రూ.40 ఉన్న పచ్చిమిర్చి రూ.80కు పెరిగాయి. కాకర, బీర కిలో రూ.80, కాలీఫ్లవర్ రూ.65, క్యారెట్ రూ.70, క్యాబేజీ రూ.50, ఆలూ కిలో రూ.60, చెవులేకాయ రూ.60, బీట్‌రూట్ రూ.80కు విక్రయిస్తున్నారు. అల్లం ధర అమాంతం పెరిగిపోయింది. ప్రస్తుతం కిలో రూ.200కు పెరిగింది. నంద్యాలలో టమోటా కిలో రూ.వంద, వంకాయ కిలో రూ.80, మునక్కాయలు ఒక్కోటి రూ.10, బీరకాయ కిలో రూ.70, ఆలూ రూ.60, క్యారెట్ రూ.70కు విక్రయిస్తున్నారు. ఆదోనిలో టమాటాలు కిలో రూ.90 నుంచి రూ.వందకు విక్రయిస్తున్నారు. ఉల్లిపాయలు కిలో రూ.50 నుంచి రూ.60కి చేరాయి. ఆలూ, బీన్స్, క్యాబేజీ పువ్వు గత నెలలో కిలో రూ.50 ఉండగా ప్రస్తుతం రూ.90కి విక్రయిస్తున్నారు. క్యారెట్ రూ.40 నుంచి రూ.70కి చేరుకుంది. బీరకాయలు, గోరుచిక్కుడు, వంకాయలు, దొండకాయలు, బెండకాయలు, క్యాబేజీ రూ.30 నుంచి రూ.60కి పెరిగాయి. సొరికంద రూ.30 నుంచి రూ.40కి, కాకరకాయలు రూ.40 నుంచి రూ.50కి చేరుకున్నాయి. కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యుల జేబులు చిల్లుపడుతున్నాయి.

కూరగాయలు కొనలేం...



రాను రాను కూరగాయలు తినలేని, కొనలేని పరిస్థితి ఏర్పడింది. టమోటా 100 రూపాయలు ఉంటే కొనేది ఎలా. వీటికి తోడు మిగిలిన కూరగాయలు అట్లే మండి పోతున్నాయి. ధరలు తగ్గించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి.

- డి.కుమారి, జూలేపల్లె, గోస్పాడు మండలం.

సామాన్యుడు బ్రతకడం చాలా కష్టం



నిత్యావసర వస్తువులు సరుకులు పెరగడం తో చాలా ఇబ్బందులు పడుతున్నాం. టమోటా, పచ్చిమిర్చి, కందిబేళ్లు, నూనె ధరలు రోజు రోజుకు పెరుగుతూ ఉండడంతో కుటుంబం గడవడం చాలా కష్టంగా. ఉంది ఏమి కొనాలన్నా తినాలన్నా భయాందోళనలకు గురవుతున్నాం. ప్రభుత్వాలు ఈ ధరలను నియంత్రించకపోతే సామాన్యుడు బ్రతకడం చాలా కష్టం. అన్ని రకాల ధరలు మండిపోతుంటే ప్రభుత్వాలు ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వాలు మారినా సామాన్యుల బ్రతుకులు మారడం లేదు.

- దర్శనం అనిత, గృహిణి, నంద్యాల.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు - జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి నంద్యాల కలెక్టరేట్

ప్రతిరోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, శారీరక, మానసిక ఒత్తిడి దూరమవుతుందని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు వెల్లడించారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా నంద్యాల ఆయుష్ విభాగం వారు పద్మావతి నగర్‌లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా చేయడం వలన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధుల నుండి బయటపడటానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఆధునిక జీవన శైలిలో భాగంగా ప్రతి ఒక్కరు కూర్చొని చేసే పనులు **(మిగతా 6వ పేజీలో..)**


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి : డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నీట్-2024 ఫలితాలు, పరీక్ష నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రులు నుండి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నందున సమగ్ర విచారణ నిర్వహించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వంశీ, శివ, ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు రఫీ డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల తహశీల్దార్ కార్యాలయం దగ్గర డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నందున ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రం గల ఒకే సీరియల్ నెంబర్లతో ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేశారని చెప్పారు. దేశవ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశం కనుక నీట్ పరీక్ష నిర్వహణ ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వ్యవహరించిన తీరుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని, నీట్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జి న్యాయ విచారణ జరిపించాలని, బాధితులను కఠినంగా శిక్షించాలని కోరారు. లీకేజీపై నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఎన్‌టిఎను రద్దు చేయాలని, నీట్ నిర్వహణ బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశ వ్యాప్తంగా నేటి విద్యార్థులను కలుపుకొని ఆందోళన చేపట్టడానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ సహాయ కార్యదర్శి బొగ్గులేని సాయి, నడిగడ్డ మా బాష, నాయకులు మహేష్, హరి, సిద్దు, రమేష్ బాబు, సుభాష్, ప్రసాద్, నాగేంద్ర, సుధాకర్, బన్నీ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

పీజీ సెట్ ఫలితాల్లో శాంతిరాం ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ


కే.తరుణ్ కుమార్

ప్రజాశక్తి - పాణ్యం : ఎపి పీజీ సెట్ ఫలితాల్లో శాంతిరాం ఫార్మసీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్ శెట్టి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన 21 మంది విద్యార్థుల్లో కే.తరుణ్ కుమార్ ఏపీ పీజీ సెట్ రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించారన్నారు. 8 మంది విద్యార్థులు 1000లోపు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతి రాముడు, ఎండి శివరాం, డాక్టర్ అశోక్ కుమార్‌లు అభినందించారు.

రైతులు వివరాలు అందజేయాలి : సిఇఒ

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని టంగుటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో ఉన్న రైతులు పొలం పాస్ పుస్తకం, ఆధార్, పాన్ కార్డు, రెండు ఫోటోలు ఇవ్వాలని సొసైటీ సిఇఒ దస్తగిరి తెలిపారు. శుక్రవారం మండలంలోని టంగుటూరు సహకార సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపట్టిన సహకార సంఘల కంప్యూటరీకరణలో భాగంలో సంఘంలో సభ్యత్వం ఉన్న ప్రతి రైతు పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, పాన్ కార్డు, 2 ఫోటోలు సంఘ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో సభ్యత్వం రద్దు అవుతుందని తెలిపారు. రైతులందరూ త్వరగా వివరాలు అందజేయాలని కోరారు.

ముఖ్యమంత్రిని కలిసిన సిపి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కేంద్ర కాటన్ బోర్డ్ మాజీ డైరెక్టర్, టిడిపి నాయకులు సిపి శ్రీనివాసరెడ్డి (వాసు) శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం అమరావతిలో జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డిలను వాసు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.


చంద్రబాబుతో సిపి శ్రీనివాసరెడ్డి


డయేరియా నియంత్రణకు పకడ్బందీ చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : డయేరియా నియంత్రణకు పకడ్బంధీ చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో అవగాహన కలిగించేందుకు జూలై 1 నుండి ఆగస్టు 31 వరకు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యుఎస్, వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అతిసార కేసుల వ్యాప్తి (స్టాప్ డయేరియా క్యాంపెయిన్)పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున ఐఈసి యాక్టివిటీలను చేపట్టాలన్నారు. ఆరోగ్య శాఖ సహకారంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్ వాడీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి వనరుల్లో కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యుఎస్, మున్సిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ డ్రైన్ల గుండా వెళ్ళే తాగునీటి పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని, ఒహెచ్ఎస్ఆర్‌లను కూడా పూర్తిగా తనిఖీ చేసి లీకేజీలను నియంత్రించాలని సూచించారు.

టిడిపి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి - బనగానపల్లె

శాసనసభలో ఎమ్మెల్యేగా బీసీ జనార్ధన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతో శుక్రవారం పట్టణంలోని టంగుటూరి శీనయ్య కార్యాలయంలో టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, నాయకులు వంగల పరమేశ్వర రెడ్డిల ఆధ్వర్యంలో కార్యకర్తలు బిసి అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం టంగుటూరి శీనయ్య, వంగలపరమేశ్వర రెడ్డిలను టిడిపి నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండోసారి బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ జనార్ధన్ రెడ్డి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మరింత ఉన్నతమైన స్థానంలో ఉండాలని, నియోజకవర్గం అభివృద్ధిలో బనగానపల్లె అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బత్తుల భాస్కర్ రెడ్డి, సీనియర్ న్యాయవాది నాగేంద్రారెడ్డి, ఖాదర్, యాగంటి ఆలయ మాజీ పాలకమండలి సభ్యులు తలారి తిరుమలయ్య, మల్లారెడ్డి, కోడి నాగేష్ బాబు, టీచర్ నాగరాజు, బొడ్డు బోయిన బాల పుల్లయ్య, పర్లపాటి వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సంబరాలు జరుపుకుంటున్న టిడిపి నాయకులు

టిడిపిలోకి కొనసాగుతున్న వైసిపి కౌన్సిలర్ల వలసలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అధికార టిడిపిలోకి మున్సిపాలిటీ వైసిపి కౌన్సిలర్ల వలసల పర్వం రెండవ రోజు కొనసాగింది. గురువారం ముగ్గురు కౌన్సిలర్లు టిడిపిలో చేరగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామానికి చెందిన ఒకటవ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ గురువిగళ్ళ లక్ష్మీనరసింహులు టిడిపి యువ నాయకులు భార్గవ్ రామ్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి భార్గవరామ్ టిడిపి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ టిడిపి కౌన్సిలర్ హుస్సేన్ భాష, సిద్ధం రెడ్డి జాఫర్ రెడ్డి, రామశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలకలం రేపుతున్న చిరుత సంచారం

- మహానంది పరిసరాల్లోనే సంచారం
- భయాందోళనలో స్థానికులు, భక్తులు
- స్పందించని అటవీ శాఖ అధికారులు

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలోని పార్వతీపురం టోల్గేట్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది. చిరుత సంచారంతో భక్తులు, గ్రామస్తులు భయాందోళనలకు గురి అవుతున్నారు. రాత్రి 7 గంటల 50 నిమిషాలకు చిరుత పులి పాత దేవస్థానం ఆఫీస్ వెనుక భాగాన ఉన్నట్లు తెలిసింది. గత వారం రోజులుగా చిరుత పులి మహానందిలో సంచరిస్తుందని, శుక్రవారం తెల్లవారుజామున టోల్గేట్ సమీపంలో చిరుత పులి రోడ్డు దాటుతుండగా చూసామని అక్కడి స్థానికులు తెలిపారు. రాత్రి సమయాల్లో పాత దేవస్థాన కార్యాలయము, పాత టోల్గేట్ ఆర్చి మధ్యలో వీధి దీపాలు కూడా వెలగక భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. ఎలాంటి ప్రాణహాని జరగక ముందే అటవీశాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.


చిరుత పులి పాద ముద్ర

సిపిఎం, ప్రజా సంఘాల నుండి బేతంచర్ల మండల కార్యదర్శి ఆర్.ఈశ్వరయ్య తొలగింపు

ప్రజాశక్తి - బేతంచెర్ల

సిపిఎం బేతంచర్ల మండల కార్యదర్శి ఆర్.ఈశ్వరయ్యను పార్టీ, వ్యవసాయ కార్మిక సంఘం నుండి తొలగించినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు తెలిపారు. శుక్రవారం బేతంచెర్లలోని సిపిఎం కార్యాలయం నందు పార్టీ మండల విస్తత స్థాయి సమావేశం పార్టీ నాయకులు ఎస్.రహమతుల్లా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం మండల కార్యదర్శి ఆర్.ఈశ్వరయ్య ఈ మధ్యకాలంలో అటు పార్టీ, ఇటు ప్రజా సంఘాల విధానాలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేసుకుంటూ పార్టీకి చెడ్డ పేరు తీసుకువచ్చాడన్నారు. జిల్లా కమిటీ అతన్ని పిలిపించి చెప్పినా వైఖరి మార్చుకోకపోవడంతో జిల్లా, మండల కమిటీల నిర్ణయం మేరకు ఈశ్వరయ్యను పార్టీ, ప్రజాసంఘాల సభ్యత్వం నుండి తొలగించినట్లు తెలిపారు. ఆర్.ఈశ్వరయ్య మండలంలో, జిల్లాలో సిపిఎం పేరుగానీ, కార్మిక సంఘాల పేరుగాని చెప్పుకొని ఏదైనా కార్యక్రమం చేపట్టినా పార్టీకి ఎటువంటి సంబంధం ఉండదన్నారు. సమావేశంలో సిపిఎంబేతంచెర్ల టౌన్ కార్యదర్శి వైబీ. వెంకటేశ్వర్లు, కార్యదర్శి వర్గ సభ్యులు వై.ఎల్లయ్య, సభ్యులు మధు శేఖర్, వెంకటరమణ, షేభారాణి, ఎన్‌కె నాగలక్ష్మి, వెంకటసుబ్బయ్య మల్లికార్జున, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


సిపిఎం, కార్మిక సంఘాల నుండి తొలగింపబడిన ఆర్.ఈశ్వరయ్య

సిఎం చంద్రబాబుకు న్యాయవాదుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసినందుకు శుక్రవారం టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో నందికొట్కూరు బార్ అసోసియేషన్ సభ్యులు సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎం.జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ఈ నల్ల చట్టాన్ని రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో పోరాటాలు చేశామన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే నల్ల చట్టం రద్దుపై రెండో సంతకం చేయడం పట్ల బార్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట రాముడు, సీనియర్ న్యాయవాదులు మల్లికార్జున రెడ్డి, సిసివి రంగారెడ్డి, విజయ్ కుమార్ సురేష్ కుమార్ విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


స్వీట్లు తినిపించుకుంటున్న న్యాయవాదులు

పోస్టల్ రాముడు మృతి


పోస్టల్ రాముడు (ఫైల్)

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలో అర్బన్ కాలనీలో నివాసం ఉంటున్న పోస్టల్ రాముడు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. పోస్టల్ రాముడు సుదీర్ఘకాలం సిపిఎం, ప్రజాసంఘాలలో పని చేశారు. పోస్టల్ రాముడు భార్య బోయ లక్ష్మమ్మ ప్రస్తుతం ఆత్మకూరు మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా ఉన్నారు. బోయ రాముడు ప్రారంభ దశలోని డివైఎఫ్ఐతో పాటు పోస్టల్ యూనియన్ నాయకులుగా పని చేశారు. చివరి దశలో ఆయన వైసిపిలో యాక్టివ్ కార్యకర్తగా పని చేశారు. ఈనాడు పాత్రికేయుడుగా సుదీర్ఘకాలం పని చేశారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు ఆయన కుటుంబ సభ్యులకు సంతాపాన్ని ప్రకటించారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామం సమీపంలో ఈ నెల 17వ తేదీ జరిగిన ఖాదర్ వలీ హత్య కేసులో నిందితుడు గువ్వలకుంట్ల మహమ్మద్ ఫరూక్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. కురుకుంద గ్రామ సమీపంలో అదుపులో తీసుకొని రిమాండ్ తరలించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : ఎంఇఒ

ప్రజాశక్తి - గడివేముల

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఇఒ మేరీ సునీత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలల్లో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ర్యాలీలో ఎంఈఓ మేరీ సునీత పాల్గొన్నారు. గడివేముల స్పెషల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యందు జరిగిన ర్యాలీలో ఎంఈఓ విమల వసుంధర దేవి పాల్గొని మాట్లాడారు. బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు ఉన్నందున, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బస్సు కిందపడి మహిళకు విరిగిన కాలు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

సుండిపెంట బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ముందు భాగం టైర్ కింద మహిళ కుడికాలు ప్రమాద వశాత్తు పడి నుజ్జునుజ్జు అయిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. పిచ్చమ్మ అనే మహిళ సున్నిపెంట బస్టాండ్ వెనుక భాగాన నివాసం ఉంటుంది. చిన్నపాటి వ్యాపారం చేసుకుంటుంది. ఉదయం దుకాణం నుండి బస్టాండ్ వెనుక భాగంలో ఉన్న ఇంటి వైపు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గమనించిన స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రధమ చికిత్సను నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు మహిళను తరలించారు.

మున్సిపల్ కమిషనర్‌కు వాలంటీర్లు వినతి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఎన్నికలకు ముందు రాజీనామా చేసిన వాలంటీర్లను కొనసాగించాలని, విధుల్లోకి తీసుకోవాలని శుక్రవారం నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ టి సుధాకర్ రెడ్డికి పలు సచివాలయాల వాలంటీర్లు వినతి పత్రం సమర్పించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ వాలంటీర్ల వినతులను ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

మరుగుదొడ్డి స్థలంలో ఇంటి నిర్మాణం

- స్థానిక మహిళలు అడ్డుకుంటూ ధర్నా
- ఎస్ఐ హామీతో ధర్నా విరమణ

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలోని శివవరం గ్రామంలో ప్రభుత్వ మరుగుదొడ్డి స్థలంలో వైసిపి నాయకుడి అనుచరుడు ఇంటి నిర్మాణం చేపడుతుండడంతో స్థానిక మహిళలు అడ్డుకుంటూ శుక్రవారం ఇంటి నిర్మాణం వద్ద ధర్నా చేశారు. మాకు మరుగుదొడ్డి కావాలంటూ మహిళలు నినాదాలు చేశారు. అనంతరం మహిళలు, కుల పెద్దలు దావీదు, పెద్దన్న, సుందరం, ఏసోబు, చెన్నప్ప, శేఖర్, దానం, దన్నమయ్య తదితరులు మాట్లాడుతూ గ్రామం ఏర్పడినప్పటి నుండి ప్రభుత్వ మరుగుదొడ్డి ఎస్సీ కాలనీలో ఉందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మరుగుదొడ్డిని పడగొట్టి నూతనంగా ప్రభుత్వ కార్యాలయం కట్టిస్తున్నామని అప్పటి స్థానిక నాయకులు చెప్పారన్నారు. అయితే ఆ స్థలానికి ఇంటి నివాస స్థలంగా పట్టా పుట్టించుకొని స్థానిక వైసిపి నాయకుడి అనుచరుడు ఇల్లు కట్టించుకుంటున్నాడని అన్నారు. విషయం తెలిసిన స్థానిక ఎస్సై కిరణ్ బాబు శివవరం గ్రామానికి చేరుకొని వివరాలను తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులతో, గ్రామపంచాయతీ అధికారులతో చర్చించి తగిన న్యాయం చేస్తానని చెప్పడంతో మహిళలు ధర్నాను విరమించారు. అక్రమంగా కట్టుకుంటున్న ఇంటి యజమానికి, ఎస్సీ మహిళలపై బైండోవర్ కేసులను నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ మరుగుదొడ్డి స్థానంలో ఇల్లు కట్టుకుంటుండడంపై ఫిర్యాదు చేస్తే తమపై బైండోవర్ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని మహిళలు ప్రశ్నించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు చర్చించి న్యాయం చేయాలని గ్రామ సంఘం పెద్దలు కోరారు.


ఎస్సీ కాలనీ మహిళలతో మాట్లాడుతున్న ఎస్సై కిరణ్ బాబు



యోగా గురువు ఇ.ఉపేంద్ర గౌడ్‌కు మెమొంటో అందజేసి సన్మానిస్తున్న సాయి శ్రీ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం


యోగా సాధనతో అనేక ప్రయోజనాలు

ప్రజాశక్తి - డోన్ : ప్రతి రోజూ యోగా చేయడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయని సాయి శ్రీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.మహేంద్ర గౌడ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం డోన్ పట్టణంలోని సాయి శ్రీ ఫంక్షన్ హాల్ నందు సాయి శ్రీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.మహేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి విద్యార్థులు యోగాలో పాల్గొని పిరమిడ్ ద్వారా యోగ ప్రాముఖ్యత ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పతాంజలి యోగా సమితి భారత్ స్వాబియన్ ట్రస్ట్ కర్నూల్ యోగా గురువు ఇ.ఉపేంద్ర గౌడ్ హాజరై వివిధ ఆసనాల గురించి వివరించారు. అనంతరం ఆయనను సాయిశ్రీ డిగ్రీ కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించి, మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సిసి ఎన్ఓలు జి.జయ శారదాంబల్, టి.సోమశేఖర్ నాయుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో కూటమి నేతల సంబరాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ మొట్టమొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసి ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శుక్రవారం శ్రీశైలంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు. మహిషాసుర మర్దిని అమ్మవారి వద్ద గుమ్మడికాయలు, టెంకాయలు సమర్పించారు. అనంతరం కూటమి నేతలు కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ శ్రీశైలం నియోజకవర్గం ఇంచార్జ్ రౌత్ అశోక్ కుమార్, టిడిపి ఇంచార్జ్ శ్రీనివాసరెడ్డి, బిజెపి మండల ఇన్చార్జ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


గుమ్మడికాయలు, టెంకాయలు సమర్పిస్తున్న కూటమి నాయకులు

సమయపాలన తప్పనిసరి : ఇఒపిఆర్‌డి

ప్రజాశక్తి - రుద్రవరం

సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఇఒపిఆర్‌డి శ్రీనివాస శర్మ తెలిపారు. శుక్రవారం నరసాపురం సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఫోటోలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాలలో మురికి నీరు నిల్వ చేరి పారిశుధ్యం లోపించే అవకాశం ఉన్నందున కార్యదర్శులు ముందస్తుగా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో కార్యదర్శి ప్రభాకర్, వీఆర్వో ఓబయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


నరసాపురం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఈవోపిఆర్డి శ్రీనివాస శర్మ

మూడేళ్ల పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

మూడేళ్ల పిల్లలను అంగన్వాడి కేంద్రంలో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ శేషమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాలలో అంగన్వాడీల బడిబాటపై ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఏఎస్ఐ కృష్ణుడు ప్రారంభించారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలో డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్త ఖుషిద్ బీ, ఆయాలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మారుతి శంకర్ లాంటి సిఐతో పోలీసు వ్యవస్థకు చెడ్డ పేరు : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

మారుతి శంకర్ లాంటి సిఐ వల్ల పోలీసు వ్యవస్థకు చెడ్డ పేరు వస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు, మండల నాయకులు పి పకీర్ సాబ్, పి గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం నందికొట్కూరులోని సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీస్ వ్యవస్థకు మచ్చ తెచ్చిన సిఐ మారుతి శంకర్‌కు తగిన శాస్త్రి జరిగిందని, న్యాయ వ్యవస్థ తీర్పు పట్ల ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఉషనమ్మ, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగేశ్వర రావు

బాలికల చదువు, హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

బాలికల చదువు ఇంటికి వెలుగు అని ఆళ్లగడ్డ ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బాలికలకు చదువు, ఆరోగ్యం, బాల్యవివాహాలు, బాలల హక్కుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యోగా డేను పురస్కరించుకుని యోగ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు మౌనిక, బాలమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ రహీం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్ల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి శుక్రవారం విజయవాడకు చెందిన వి.దీప్తి రూ.1,00,101లు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఏం.ఫణిధర ప్రసాద్‌కు అందజేశారు. అధికారులు దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

ఘనంగా పల్లకి సేవ మహోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. చౌడేశ్వరి దేవి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు

అహోబిలంలో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. బైరెడ్డికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎగువ అహోబిలంలో లక్ష్మి నరసింహ స్వామి మూలవిరాట్‌కు, దిగువ అహోబిలంలో ఉత్సవ మూర్తులను బైరెడ్డి దర్శనం చేసుకున్నారు. ఆలయ పూజారులు బైరెడ్డిని శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదం అందించి ఆశీర్వదించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి-శ్రీశైలం పుణ్యక్షేత్రాలను కలుపుతూ నల్లమల ప్రకతి అందాలను ఆస్వాదించేలా వైష్ణవ, శైవ క్షేత్రాల దర్శనం కారిడార్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని కోరారు. నంద్యాల పార్లమెంట్ ఎంపీగా తన కూతురు బైరెడ్డి శబరి విజయం సాధించడంతో అహోబిలంలో స్వామి అమ్మ వార్లను దర్శనం చేసుకొని మొక్కు తీర్చుకున్నామని, ఎంపీ శబరితో ఈ పుణ్యక్షేత్రాల కారిడార్‌కు కృషి చేస్తామన్నారు.



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

5వ పేజీ తరువాయి.. అధికంగా ఉండటం వల్ల నడుము నొప్పి, మెడ నొప్పి, దీర్ఘకాలిక వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయని, వీటికి నిరంతరం యోగా చేయడం వలన ఉపశమనం పొందవచ్చన్నారు. అనంతరం యోగా విన్యాసాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాల విద్యార్థినులు యత్రం చరిత, యత్రం భవితలను, పాఠశాల యాజమాన్యాన్ని, గురువు స్వామిని, కలెక్టర్, జెసిలు అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అంకిరెడ్డి, ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ యశోదర, డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి రాజు, ఆయుష్ శాఖ సిబ్బంది, సూక్లియస్ కాలేజీ విద్యార్థులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. శాంతినికేతన్ విద్యామందిర్‌లో, క్రాంతినగర్‌లోని హార్ట్ ఫుల్ నెస్ఇన్స్టిట్యూట్ నందు జరిగిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు యోగా చెయ్యడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అడిషనల్ ఎస్పీ కే.ప్రవీణ్ కుమార్, ఏఆర్‌డి ఎస్‌పి శ్రీనివాసులు, నంద్యాల టౌన్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, ఏఆర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ పార్కులోని ఆయుష్ యోగా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, 12వ వార్డు కౌన్సిలర్ శ్యామ్ సుందర్ లాల్ పాల్గొన్నారు. ఆయుష్ యోగ నిర్వాహకులు ఆనంద్ గురూజీ, పుర ప్రముఖులు, యోగా సభ్యులు పాల్గొన్నారు. **పాములపాడు**లోని జడ్పీహెచ్ హైస్కూల్, వేంపేట జడ్పీహెచ్ఎస్ హైస్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో, వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు చేశారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, రాజ్యలక్ష్మి, గోపాల్, ఉపాధ్యాయులు మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** మండలంలోని అయ్యలూరు గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత ఉర్దూ పాఠశాలలో హెచ్ఎం సి.అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో యోగా టీచర్ షబానా విద్యార్థులకు యోగా ప్రాముఖ్యత వివరించారు. ఉపాధ్యాయులు అఖిల బాను, షబానా పర్వీన్, నాసిర, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. నంద్యాల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీడీవో సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, ఎంఈఓ, ఎన్ఆర్ఇజిఎస్ అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. **నంద్యాల**లోని శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద ఆడిటోరియంలో కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రముఖ యోగా కేంద్రం సత్యసాయి ధ్యానమండలి గురూజీ బిక్షమయ్య, బాల అకాడమీ చైర్మన్ ఎంసి కొండయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సత్యసాయి ధ్యాన మండలి సభ్యులు యోగాసనాలు విద్యార్థులతో చేయించారు. కళాశాల చైర్మన్ రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా యోగాను ఎంతో ప్రాముఖ్యతలోనికి తీసుకొచ్చినవారు ప్రధాని నరేంద్ర మోడీ అని అన్నారు. బాల అకాడమీ చైర్మన్ ఎంసి కొండయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చిన్నతనం నుండే యోగాను ప్రాక్టీస్ చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య మాట్లాడుతూ యోగా వలన విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరుగుతుందని అన్నారు. అనంతరం కళాశాల ఎన్సిసి బాయ్స్ అండ్ గర్ల్స్ క్యాడేట్స్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో సత్య సాయి ధ్యాన మండలి సభ్యులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. **ఆత్మకూరు** పట్టణంలోని తోటగేరిలో ఉన్న శ్రీ పద్మావతి హైస్కూల్‌లో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పి.ఆశ మాట్లాడుతూ విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సురేష్, ముర్తుజావలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రఘురామాచార్యులు ఆధ్వర్యంలో అధ్యాపకులు ఎండి బ్రహ్మానందం, యోగా శిక్షకుడు షేక్ నాజర్ పాల్గొన్నారు. **పగిడ్యాల** మండలంలోని ఆయా పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. **రుద్రవరం** మండలంలోని ఆయా పాఠశాలల్లో యోగా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. మోడల్ పాఠశాలలో ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరరావు, జడ్పీహెచ్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల** మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో, కార్యాలయాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. **సంజామల** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, ఎంపీడీవో, తాసిల్దార్ కార్యాలయాలల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. **బనగానపల్లె** పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఆవరణలో యోగా కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ అద్వర్యంలో జరిగిన వేడుకల్లో ఇంచార్జి జడ్జి అబ్దుల్ రహిమాన్ నేతత్వంలో యోగా గురువు తిరుమలేష్ పర్యవేక్షణలో కోర్టు సిబ్బంది న్యాయవాదులు, కోర్టుకు వచ్చిన కాక్షిదారులు యోగాసనాలు వేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా హుస్సేన్, టి వెంకటేశం, తులసీశ్వరమ్మ, ఎం.రఘురామిరెడ్డి, అల్లావుద్దీన్, సీనియర్ న్యాయవాదులు పరశురామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, యూసఫ్ హుస్సేన్, అజాం హుస్సేన్, ప్రకాష్ రెడ్డి, కమల్ తేజ్ రెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ విద్యా విభాగం అధ్యాపకురాలు వి. విజయ కుమారి ఆధ్వర్యంలో యోగ డేను నిర్వహించారు. ప్రభుత్వ ఆయుర్వేద డాక్టర్, మాధవరావు చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల నుండి నవాబు కూడలి వరకు కళాశాల విద్యార్థులతో యోగ అవగాహన ర్యాలీని నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. **శ్రీశైలం** దేవస్థానంలోని దక్షిణమాఢ వీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద యోగా దినోత్సవం నిర్వహించారు. దేవస్థాన ఉప కార్యనిర్వహణాధికారి రవణమ్మ, శ్రీశైలప్రభ సంపాదకుడు సి.అనిల్ కుమార్, సిబ్బంది, ప్రముఖ యోగా శిక్షకులు గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. **డోన్**లోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యోగా గురూజీ రవీంద్రనాథశర్మ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీ కాంత రెడ్డి, లక్ష్మీ ప్రభావతి, హుస్సేన్ భాను, సుబ్బారెడ్డి, వెంకట రమణ, రవిశేఖర్, వెంకటలక్ష్మీ, లక్ష్మయ్య, రాధ, శ్రీనివాసులు, బాబు, అల్లిపీరా, శివన్న, జయ సుబ్బరాయుడు, సుభాన్, మధుసూదన్ రెడ్డి, భూకాంత రెడ్డి, సుబ్బారాయుడు, ఎస్తేరమ్మ, రఘునాథ్, సురేష్, దేవేంద్రప్ప, భానుప్రకాష్ రెడ్డి, భారతి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **మహానంది** ఫారంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో యోగా టీచర్లు మహేశ్వర్, లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు పలు ఆసనాలు వేయించి, సాధన చేయించారు. వ్యవసాయ కళాశాల ఇన్చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజిని దేవి, ఎన్ఎస్ఎస్ పిఓ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఓఎస్ఏ డాక్టర్ విజయ్ భాస్కర్, పిడి చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ పిఓ డాక్టర్ మాధవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **అవుకు** మండలంలోని అంగన్వాడీ సెంటర్లలో యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు చేయించినట్లు సూపర్వైజర్ శివమ్మ తెలిపారు. **నందికొట్కూరు టౌన్** లోని స్థానిక బైరెడ్డి నగర్ కోట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సలీమ్ భాష సభాధ్యక్షతన ఎంఇఒ-2 శ్రీనివాసులు పాల్గొన్నారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ పెరుమాళ్ళ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగ దినోత్సవంలో యోగా నిపుణులు మురళీధర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సునీత అధ్యక్షత వహించి మాట్లాడారు. **బేతంచర్ల** సరస్వతి శిశు మందిర్ ఆవరణంలో సమర్థ సేవ ఫౌండేషన్ నంద్యాల డివిజన్ కన్వీనర్ నాగమోహన్ రెడ్డి యోగాసనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. **ఆళ్లగడ్డ**లోని టిఎస్ బ్రదర్స్ ఫంక్షన్ హాల్‌లో ఐదవ అదనపు జిల్లా జడ్జి మురళీకష్ణ ఆధ్వర్యంలో యోగా దినోత్సవంను సీనియర్, జూనియర్ న్యాయ మూర్తులతో కలిసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్. శైలజ, జూనియర్ సివిల్ జడ్జి ఎం.ఈశ్వర్ వెంకట ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్య నారాయణ రెడ్డి, యోగా మాస్టర్ వెంకటాద్రి, రాధాకృష్ణారెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


యోగా చేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్, కమిషనర్ తదితరులు


యోగాసనాలు వేస్తున్న జిల్లా ఎస్పీ తదితరులు


పాములపాడు : కెజిబివి పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేస్తున్న దృశ్యం


ఆళ్లగడ్డ : యోగా చేస్తున్న న్యాయమూర్తులు


నంద్యాల రూరల్ : యోగా చేస్తున్న విద్యార్థులు


ఆత్మకూరు : శ్రీ పద్మావతి హైస్కూల్‌లో ..


బనగానపల్లె : యోగా చేస్తున్న న్యాయవాదులు


మహానంది : వ్యవసాయ కళాశాలలో


నందికొట్కూరు టౌన్ : సన్మానిస్తున్న దృశ్యం


డోన్ : విద్యార్థులచే యోగా ఆసనాలు చేయిస్తున్న యోగా గురువు రవీంద్రనాథశర్మ


పగిడ్యాల : ప్రభుత్వ పాఠశాలలో..


రుద్రవరంలో..


శ్రీశైలంలో..



నంద్యాల : మాట్లాడుతున్న భిక్షయ్య గురు